సాక్షి వరంగల్

ఆదివారం | 7 | సెప్టెంబర్ | 2025



దేవాలయాల అభివృద్ధే ధ్యేయం

దేవాలయాల అభివృద్ధే ధ్యేయంగా సీఎం రేవంత్ నేతృత్వంలో ప్రజాప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని మంత్రి కొండా సురేఖ అన్నారు. - 8లో▸



మొరాయిస్తున్న ఈవీ బస్సులు

వరంగల్ రీజియన్ పరిధిలో నడిచే ఎలక్ట్రికల్ బస్సులు సాంకేతిక సమస్యలతో మొరాయిస్తున్నాయి. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$33^0/24^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఉంటుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

విద్యుత్ దీపాలు ప్రారంభం



నర్సంపేట రూరల్: నర్సంపేట పట్టణంలోని మహాత్మా జ్యోతిరావుపూలే బాలికల గురుకుల పాఠశాలలో విద్యుత్ దీపాలను రీజినల్ కోఆర్డినేటర్ (ఆర్‌సీఓ) రాజ్‌కుమార్ శనివారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు సాయంత్రం చదువుకోవడానికి ఇబ్బంది పడకుండా ఉండేందుకు లైట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లైట్లను ప్రారంభించినందుకు ఏబీఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, స్వేరోస్ జిల్లా మాజీ అధ్యక్షుడు శనిగరపు రాజేందర్ తదితరులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీసీఓ సరిత, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్ రాజేశ్వరి, మల్లయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

8 వరకు అభ్యంతరాల స్వీకరణ : జెడ్పీ సీఈఓ

న్యూశాయంపేట: రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు జిల్లాలోని 11 జెడ్పీటీసీలు, 130 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించిన ఓటర్ల జాబితా, 694 పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాలను జిల్లా పరిషత్ కార్యాలయం, అన్ని మండల పరిషత్, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించినట్లు జిల్లా పరిషత్ సీఈఓ రాంరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యంతరాల స్వీకరణకు ఈనెల 8వ వరకు గడువు ఉందని, 9న పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ నెల 8న జిల్లా పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

గణపతి లడ్డూ @ 1,75,550



రాయపర్తి: మండలంలోని బాలాజీతండాలో బాలాజీ బంజార యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద శనివారం లడ్డూను వేలం వేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బానోత్ లక్ష్మణ్ నాయక్ రూ.1,75,550కు లడ్డూను దక్కించుకున్నారు. నాలుగేళ్ల నుంచి వినాయకుడి లడ్డూ అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు బానోత్ సోమ్లానాయక్, గుగులోత్ నాదం, బానోత్ భిక్షపతి, యూత్ సభ్యులు క్రాంతి, తేజ, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.


సంఘాలు సమర్థవంతంగా నిర్వహించాలి



గీసుకొండ: గ్రామాల్లోని మహిళా పొదుపు సంఘాలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా పరిషత్ సీఈఓ, ఇన్‌చార్జ్ డీఆర్‌డీఓ జి.రాంరెడ్డి అన్నారు. కొనాయమాకులలోని ప్రగతి మండల సమాఖ్యలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. త్వరలో ఏర్పాటు చేయనున్న డెయిరీని పొదుపు సంఘాల వారు విజయవంతం చేయాలన్నారు. ఏపీఎం ముక్కెర ఈశ్వర్ మాట్లాడుతూ నగదు రహిత లావాదేవీల పైలట్ ప్రాజెక్టును పొదుపు సంఘాలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అదనపు డీఆర్‌డీఓ రేణుకాదేవి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు రేవతి, దాసు, వరలక్ష్మి, అనిల్, ఏపీఎంలు సారయ్య, శ్రీనివాస్, రాజు, ప్రగతి మండల సమాఖ్య అధ్యక్షురాలు గట్టు రాధిక, కార్యదర్శి శారద, కోశాధికారి శిల్ప, సీసీలు సురేశ్, శ్రీలత, నర్సయ్య పాల్గొన్నారు.

తండ్రిని హత్యచేసిన తనయుడు

వర్ధన్నపేట : కోడలిని కొట్టొద్దన్నందుకు తండ్రిని తనయుడు హత్యచేసిన సంఘటన వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని గుబ్బేట తండాలో శనివారం రాత్రి జరిగింది. తండా వాసుల కథనం ప్రకారం.. సపావట్ సురేశ్ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య మౌనికతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం రాత్రి సురేశ్ తన భార్య మౌనికను కొడుతుండగా.. గమనించిన అయన తండ్రి రాజు (60) కోడలిని కొట్టొద్దని అడ్డుగా వెళ్లాడు. కోపోద్రిక్తుడైన సురేశ్.. తండ్రి రాజు కడుపులో ఛాతిపై దాడిచేశాడు. దీంతో రాజు అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు.



వివిధ భాషల్లో 5వేల పుస్తకాలు, వందలాది జర్నల్స్, పురాతన స్క్రిప్ట్‌లు.. ఒకేచోట కొలువై ఉన్న ప్రొఫెసర్ గజ్జెల రామేశ్వరం ఇంటర్నేషనల్ నేచురోపతి లైబ్రరీ అండ్ రీసెర్చ్ సెంటర్ ఇక.. అనేక మంది విద్యార్థుల పరిశోధనలకు ఉపయోగపడనుంది. అరుదైన విజ్ఞాన సంపద ఉన్న ఈ ప్రకృతి గ్రంథాలయంతో ఇటీవల కాకతీయ యూనివర్సిటీ అవగాహన ఒప్పందం (ఎంఓయూ) చేసుకుంది. గత జూలైలో పుణే జాతీయ ప్రకృతి వైద్య సంస్థ కూడా పరస్పర ఒప్పందం చేసుకుంది. భారతీయ సంప్రదాయ విజ్ఞాన వ్యవస్థ అభివృద్ధి వ్యాప్తికి పరిశోధనలు, శిక్షణ వంటి విద్యా కార్యక్రమాల్లో పరస్పర ప్రయోజనాలు పొందనున్నారు. ఈ ప్రకృతి వైద్య గ్రంథాలయం ప్రత్యేకతలు, విద్యార్థులకు ఉపయోగం, తదితర అంశాలపై ఈ వారం ప్రత్యేక కథనం.

సండే స్పెషల్



ప్రకృతితో ఒప్పందం.. పరిశోధనల సుగంధం!



నేచురోపతి లైబ్రరీ రీసెర్చ్ సెంటర్‌తో కేయూ, పుణే సంస్థల ఎంఓయూ

- ఇంటినే గ్రంథాలయంగా మార్చిన గజ్జెల రామేశ్వరం
- వివిధ భాషల్లో 5 వేల పుస్తకాలు, జర్నల్స్ అందుబాటులో..
- ప్రకృతి వైద్యపరిజ్ఞానం పెంపొందించుకునే అవకాశం



హనుమకొండలోని ఆచార్య గజ్జెల రామేశ్వరం అంతర్జాతీయ నేచురోపతి లైబ్రరీ ఇదే..

కేయూ క్యాంపస్:

హనుమకొండ ప్రకాశ్‌రెడ్డిపేటలోని ఇంటర్నేషనల్ నేచురోపతి లైబ్రరీ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో దేశ, విదేశీ భాషా గ్రంథాలు ఉన్నాయి. ప్రకృతివైద్యానికి సంబంధించిన 50 పత్రికలు లభిస్తాయి. కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం విశ్రాంత ఆచార్యులు గజ్జెల రామేశ్వరం 2018 జూలై 24న తన ఇంటిలోనే ఈ లైబ్రరీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేశారు. ప్రకృతి వైద్యంపై ఆసక్తి ఉన్నవారు ఈ లైబ్రరీలో ఉచితంగా ప్రవేశించి చదువుకునే అవకాశం కల్పించారు.

పుణే జాతీయ ప్రకృతివైద్య సంస్థతో..

పుణేలోని జాతీయ ప్రకృతివైద్య సంస్థ గత జూలై 1న ఈ ప్రకృతి వైద్య గ్రంథాలయ పరిశోధన కేంద్రంతో ఎంఓయూ కుదుర్చుకుంది. ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ సత్యలక్ష్మి, రామేశ్వరం ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. పుణే జాతీయ ప్రకృతి వైద్య సంస్థలో ఆస్పత్రి ఉంటుంది. అక్కడి నేచురోపతి కోర్సుల విద్యార్థులకు క్లినికల్ రీసెర్చ్‌కు సంబంధించిన ప్రకృతి వైద్య విజ్ఞాన పుస్తకాలు, జర్నల్స్ ఇక్కడి లైబ్రరీ రీసెర్చ్‌సెంటర్‌లో ఉన్నాయి. ఆ విద్యార్థులు ఇక్కడికి వచ్చి వినియోగించుకుంటారు. ఇతర దేశాల శాస్త్రవేత్తలు, ప్రకృతి వైద్యులు తమ సంస్థను సందర్శించిన సమయంలో పరిశోధనల విజ్ఞాన పుస్తకాలు ఇక్కడ అందుబాటులో ఉండడం వల్ల వారిని తరచూ ఇక్కడికి పంపే అవకాశాలున్నాయి. ఇది హెల్త్ ఎడ్యుకేషన్ టూరిజానికి ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.

యోగా, హిస్టరీ, లైఫ్ సైన్సెస్ వారికి ఉపయుక్తం

కేయూ దూరవిద్యలో యోగా డిప్లొమా కోర్సు నడుస్తోంది. ఈ విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలు 300 వరకు ఉన్నాయి. ఫిజికల్ ఎడ్యుకేషన్‌లోనూ నేచురోపతిపై ఒక పేపర్ ఉంది. సైకాలజీ విద్యార్థులకు మానసిక వైద్య విద్యకు సంబంధించి ప్రకృతి వైద్యపరంగా విజ్ఞానసంపద ఉంది. భారత ప్రకృతివైద్య చరిత్ర, ప్రకృతి వైద్య ఉద్యమ వైతాళికులు ఎవరు అనే అనేక అంశాలు, చారిత్రక పరంగా ప్రకృతి వైద్యవిధానం ఎలా వచ్చిందనే దానిపై హిస్టరీ విద్యార్థులు, పరిశోధనలకు ఈలైబ్రరీ రీసెర్చ్‌సెంటర్‌లో అనేక దేశ, విదేశాల పుస్తకాలు, జర్నల్స్ అందుబాటులో ఉన్నాయి. లైఫ్‌సైన్సెస్ పీజీకోర్సుల విద్యార్థులకు ఉపయోగపడే జ్ఞాన సంపద అందుబాటులో ఉంది.

కేయూతో ఎంఓయూతో కలిగే ప్రయోజనాలు..

కాకతీయ యూనివర్సిటీ వారు ఈ నెల ఒకటో తేదీన ప్రకృతి వైద్య గ్రంథాలయంతో ఎంఓయూ చేసుకున్నారు.

- ప్రకృతి వైద్యజ్ఞానాన్ని సమయానికి పొందేలా ఈ లైబ్రరీ రీసెర్చ్ సెంటర్‌లోని పుస్తకాల క్యాటలాగ్, వర్గీకరణ చేపడతారు. ఇందుకు కేయూ లైబ్రరీ సైన్స్ విద్యార్థులను వినియోగిస్తారు.
- ఇరు సంస్థల వర్క్‌షాప్‌లు, సేవల మార్పిడి కోసం ఎలాంటి ఆర్థిక భారం ఉండబోదు. సదస్సులు, సమావేశాలను సంయుక్తంగా నిర్వహించేందుకు అవకాశం ఉంది.
- ఎంఎల్‌ఐఎస్సీ విద్యార్థులు, పీహెచ్‌డీ పరిశోధకులు తమ ప్రాజెక్ట్ వర్క్స్, ఇంటర్న్‌షిప్‌లకు అధ్యయనం చేసేందుకు ఈ ప్రకృతి వైద్య లైబ్రరీలోకి అనుమతి ఉంటుంది.
- ఆర్ట్స్ విద్యార్థులు ప్రకృతి వైద్య విజ్ఞాన సంపదను వినియోగించుకోవచ్చు. ఉదాహరణకు తెలుగు భాషలో ప్రకృతివైద్యంపై పద్యాలు, కవితల రూపంలో కూడా చికిత్స విధానాలున్నాయి.
- అమెరికా సిలికాన్ యూనివర్సిటీలో ఆయుర్వేద డిప్లొమా కోర్సు నడుస్తున్నది. తెలుగు, హిందీ భాషల్లో ప్రకృతి వైద్యానికి సంబంధించిన పుస్తకాలు, జర్నల్స్ ఉన్నాయి. ఆయా భాషల్లో ప్రకృతి వైద్యంపై పరిశోధన చేయాలనుకునేవారికి ఎంతో ఉపయోగపడనుంది.
- ఫార్మసీ విద్యార్థులకు ఫార్మాకాగ్నెస్సీ నేచురోపతికి సంబంధించిన ఆయుర్వేదం, యోగా, నేచురోపతి మీద ఒక పేపర్ ఉంది. ఆయా విద్యార్థుల సిలబస్‌కు అనుగుణంగా న్యూట్రిషన్స్, రోగ నిరోధకత పరిశోధనలకు ఉపయోపడే ప్రకృతి వైద్యం, విజ్ఞాన పుస్తకాలను ఉపయోగించుకోవచ్చు.



కేయూలో ఎంఓయూ పత్రాలు చూపుతున్న రిజిస్ట్రార్ రామచంద్రం, గజ్జెల రామేశ్వరం (ఫైల్)



ఎంఓయూ పత్రాలు మార్చుకుంటున్న సత్యలక్ష్మి(పుణే), గజ్జెల రామేశ్వరం (ఫైల్)

ప్రకృతి వైద్యవిజ్ఞానం ప్రజాబాహుళ్యంలోకి..



మూడున్నర దశాబ్దాలుగా సేకరించిన అరుదైన ప్రకృతి వైద్యవిద్య, సాహిత్య విజ్ఞాన సంపదను అందుబాటులో ఉంచా. కేయూ, పుణేలోని జాతీయ ప్రకృతివైద్య సంస్థతో మా లైబ్రరీ రీసెర్చ్ సెంటర్‌తో ఎంఓయూ కుదుర్చుకున్నాం. విజ్ఞాన సంపదను విద్యార్థులు, పరిశోధకులు ఉపయోగించుకోవాలి.

– గజ్జెల రామేశ్వరం, ప్రకృతి వైద్య లైబ్రరీ రీసెర్చ్ సెంటర్ వ్యవస్థాపకుడు

ఇంటర్న్‌షిప్‌నకు కూడా..



ఈ ఎంఓయూతో ఎంఎల్‌ఐఎస్సీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌నకు అవకాశం లభించింది. తొలుత ఒకటి రెండురోజుల్లోనే ఇద్దరు విద్యార్థులను ఆ లైబ్రరీ సెంటర్‌కు పంపనున్నాం. మా లైబ్రరీ సైన్స్ విభాగంనుంచి ఆ లైబ్రరీలో పుస్తకాల క్యాట్‌లాగ్, క్లాసిఫికేషన్‌కు విద్యార్థులు సహకారం అందిస్తారు. –డాక్టర్ రాధికారాణి, కేయూ లైబ్రరీ సైన్స్ విభాగం అధిపతి

పల్లెలకు పాలనాధికారులు

- 165 మందికి నియామక పత్రాలు అందించిన సీఎం రేవంత్‌రెడ్డి
- రెండు రోజుల్లో కౌన్సెలింగ్, మెరిట్ ప్రాతిపదికన పోస్టింగ్
- గ్రామాల్లో పరిష్కారం కానున్న రెవెన్యూ, భూ సమస్యలు
- జిల్లాలో 174 రెవెన్యూ క్లస్టర్లు.. 191 రెవెన్యూ గ్రామాలు



నల్లబెల్లి: శాఖల మధ్య సమన్వయం పెంచేందుకు, గ్రామాల్లో ప్రజలకు పారదర్శకంగా సేవలందించేందుకు ప్రభుత్వం గ్రామ పాలన అధికారుల (జీపీఓ)ను నియమించింది. జిల్లాలో నియమితులైన 165 మంది ఈ నెల ఐదో తేదీన హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో హైటెక్స్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నారు. వీరందరికీ రెండు రోజుల్లో కలెక్టర్ సమక్షంలో పారదర్శకంగా కౌన్సెలింగ్ నిర్వహించి మెరిట్ ఆధారంగా క్లస్టర్ల వారీగా పోస్టింగ్ ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. ప్రధానంగా సొంత మండలం, నియోజకవర్గంలో నియమించరాదని నిబంధన విధించింది. గ్రామపాలన అధికారి పోస్టుల భర్తీకి గతంలో వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలుగా పనిచేసిన వారు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం వీరికి పరీక్షలు నిర్వహించి అర్హులను జీపీఓలుగా ఎంపిక చేసింది. నియామకపత్రాలు అందుకున్న వారిని క్లస్టర్ల వారీగా నియమించనుంది. వీరి నియామకంతో గ్రామాల్లో రెవెన్యూ, భూముల వివాదాలు త్వరగా పరిష్కారంకానున్నాయి. ప్రజలు మండల కేంద్రాల్లో కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గుతుంది. పంచాయతీ, రెవెన్యూ, వైద్య, విద్య తదితర శాఖల మధ్య సహకారం పెరుగుతుంది. జిల్లాలో 174 రెవెన్యూ క్లస్టర్లు.. 191 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి.

జీపీఓల విధులు..

- గ్రామ పరిపాలన అధికారులు గ్రామ స్థాయిలో రెవెన్యూ, పరిపాలన సేవల సమన్వయకర్తలుగా ఉంటారు.
- ధ్రువపత్రాల జారీకి సంబంధించి విచారణ చేయాలి. ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, నీటి వనరులను కాపాడాలి.
- సర్వేయర్లకు సహకరించి, భూవివాదాలను పరిష్కరించాలి.
- విపత్తుల సమయంలో దగ్గరుండి సహాయక చర్యలు చేపట్టడంతోపాటు గ్రామాల్లో అత్యవసర సేవలు అందించాలి.
- ఎన్నికల విధుల్లో సిబ్బందికి సాయం చేయాలి. మండలంలోని అధికారులతో సమ్వయంతో కలిసి పనిచేయాలి.
- ప్రభుత్వం, భూపరిపాలన ప్రధాన కమిషనర్, కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్ స్థాయి అధికారులు ఏపని అప్పగించినా చేయాలి.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



గత ప్రభుత్వం రెవెన్యూ శాఖలో వీఆర్‌ఓ, వీఆర్‌ఏ వ్యవస్థను రద్దు చేసి వివిధ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్లుగా నియమించింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం పునరాలోచించి గతంలో వీఆర్‌ఓ, వీఆర్‌ఎలుగా పనిచేసి ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానించి పరీక్ష నిర్వహించింది. అర్హులైన వారిని గ్రామ పాలన అధికారు (జీపీఓ)లుగా నియమించింది. ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం.

- సోనబోయిన సదానందం, జీపీఓ

రెవెన్యూ సేవలు సులభం..



ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా గ్రామ పాలనాధికారులు గ్రామ స్థాయిలో రెవెన్యూ, పరిపాలన సేవలను సులభంగా అందించేందుకు నిరంతరం కృషి చేస్తారు. ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయి. గ్రామాల్లోని రెవెన్యూ, భూసమస్యలు పరిష్కారమవుతాయి.

- ముప్పు కృష్ణ, తహసీల్దార్, నల్లబెల్లి

ఆరుగురిపై కేసు

నర్సంపేట రూరల్: భార్యభర్తల పంచాయితీలో పరస్పరం దాడులు చేసుకున్న ఆరుగురిపై కేసులు నమోదు చేసినట్లు నర్సంపేట టౌన్ సీఐ రఘుపతిరెడ్డి తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. ఖానాపురం మండలంలోని మంగళవారిపేట గ్రామానికి చెందిన బాదావత్ శిరీషకు నెక్కొండ మండలం రెడ్లవాడకు చెందిన భూక్యా సురేశ్‌తో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వరకట్నం వేధింపులకు గురిచేస్తున్నాడని సురేశ్‌పై శిరీష ఖానాపురం పోలీస్ స్టేషన్‌లో కొంతకాలం క్రితం ఫిర్యాదు చేసింది. ఆకేసు విడాకుల వరకు చేరింది. అయితే, పెళ్లి సందర్భంగా ఇచ్చిన కట్నం డబ్బులు తిరిగి ఇవ్వాలనే విషయంపై శనివారం నర్సంపేటలో గొడవ జరగడంతో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నాయి. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఇరువర్గాలు ఫిర్యాదు చేశాయి. ఈ మేరకు ఫిర్యాదు చేసిన ఇరువర్గాల్లోని ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఆలస్యం.. జలచరాలకు విషం!

- గ్రేటర్ వరంగల్‌లోని 22 చెరువుల్లో వేల టన్నుల వ్యర్థాలు
- ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ఘన వ్యర్థాల తొలగింపుపై నిర్లక్ష్యం
- రోజుల వ్యవధిలో తొలగిస్తేనే జలచరాలకు మంచిది
- బతుకమ్మ తర్వాతే తొలగింపు ఉంటుందనడంతో ఆందోళన
- ప్రజలకు డెంగీ, మలేరియా ప్రబలే అవకాశం
- త్వరగా వ్యర్థాలు తొలగించాలంటున్న పర్యావరణ ప్రేమికులు



చిన్న వడ్డేపల్లి చెరువులో ఒడ్డుకు వచ్చిన గణేశ్ ప్రతిమల వ్యర్థాలు

ఏటా నిమజ్జనం అనంతరం చెరువుల్లో లభ్యమయ్యే వ్యర్థాలు	
గ్రేటర్ నగరంలోని చెరువులు:	22
ఘన వ్యర్థాలు:	5 వేల టన్నులు
అధిక గాఢత ఉన్న రసాయనాలు:	10 వేల లీటర్లు
ఇనుము:	100 టన్నులు,
కలప:	50 టన్నులు,
పీఓపీ:	20 టన్నులు

సాక్షి, వరంగల్: నగరంలో నిమజ్జన తంతు ముగిసింది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ఇతర రసాయనాలతో చేసిన గణపతి ప్రతిమలతో చెరువుల్లో వేల టన్నుల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. ఫలితంగా చెరువులు కాలుష్యానికి కేంద్రాలవుతున్నాయి. ఈ ఘనవ్యర్థాలను రోజుల వ్యవధిలో తీయాల్సిన బల్దియా, నీటి పారుదల శాఖ అధికారులు ఆలసత్వం వహిస్తున్నారు. పీఓపీ, ఇతర హానికారక రసాయనాలు, రంగులు నీళ్లలో కలిసిపోవడంతో ఆయా చెరువులు మరింత కలుషితమవుతున్నాయని పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా జలచరాలతో పాటు భూగర్భ జల మట్టం హానికరంగా మారనుంది. ఆ నీటిని సాగుకు ఉపయోగిస్తే పంటలు దెబ్బతినే అవకాశం ఉంది. గతేడాది నిమజ్జనం చేసిన గణేశ్ విగ్రహాలకు ఉండే ఇనుము, కలప చిన్న వడ్డేపల్లి చెరువులో కనిపించింది. చెరువుల పరిరక్షణ సొసైటీ సభ్యులు ఇటీవల బల్దియా అధికారులతో వాగ్వాదానికి దిగడంతో వాటిని తొలగించారు.

బతుకమ్మ పండుగ తర్వాత?

బతుకమ్మ పండుగ సమయంలో చెరువుల్లో పూలను వేస్తారు. వాటితో పాటుగానే నిమజ్జన వ్యర్థాలను నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి తొలగిస్తారని బల్దియా ఉన్నతాధికారులు చెబుతున్నారు. వినాయకులు నిమజ్జనం చేసిన గంటల వ్యవధిలోనే ఈ వ్యర్థాలను తొలగించడం ద్వారా కొంతమేర జల కాలుష్యానికి అడ్డుకట్ట పడే అవకాశం ఉంది. గ్రేటర్ వరంగల్‌లో 22 చెరువుల్లో కలిపి చిన్న, పెద్దవి కలిపి 15,000 విగ్రహాలు నిమజ్జనమైనట్లు బల్దియా అధికారులు చెబుతున్నారు. అధిక మోతాదులో హానికారక రసాయనాలు, వ్యర్థాలు, మూలకాలు నీటిలో ప్రవేశించడంతో జలాయశంలో ప్రతీ లీటరు నీటిలో జీవరాశుల మనుగడకు అత్యావశ్యకమైన బయాలాజికల్ ఆక్సిజన్ డిమాండ్ (బీఓడీ), కెమికల్ ఆక్సిజన్ డిమాండ్ పెరగడం, అదేసమయంలో నీటిలో ఆక్సిజన్ స్థాయి పడిపోతుందన్న ఆందోళన ఉంది. ఇది ప్రతి లీటరు నీటిలో సున్నాగా నమోదయ్యే ఆస్కారం ఉంది. అదేవిధంగా ఈ చెరువుల్లో చేపల పెంపకం ఎక్కువగా ఉండడంతో మత్స్యకారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

వెంటనే వ్యర్థాలు తొలగించాలి..



చెరువుల్లో చేపలు, పక్షులు, వృక్ష, జంతు, అణుకీటకాల మనుగడ ప్రశ్నార్థకమవుతోంది. సమీప ప్రాంతాల్లో గాలి, నీరు కలుషితమవుతోంది. భూగర్భ జలాలు హాని కారకాలుగా మారతాయి. ఆయా చెరువుల్లో పట్టిన చేపలను తిన్న వారికి శరీరంలోకి హానికారక మూలకాలు చేరతాయి. చేపల ద్వారా మానవ శరీరంలోకి మెర్క్యూరీ మూలకం చేరితే మెదడులో సున్నితమైన కణాలు దెబ్బతింటాయి. మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలే అవకాశముంది. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని నిమజ్జనం జరిగిన గంటల వ్యవధిలోనే వ్యర్థాలను తొలగించాలి.

- పెరుమాండ్ల లక్ష్మణ్, చెరువుల పరిరక్షణ సొసైటీ అధ్యక్షుడు

తక్షణమే చర్యలు తీసుకోవాలి



చెరువుల్లో నిమజ్జనం చేసిన వినాయక విగ్రహాల వ్యర్థాల తొలగింపునకు చర్యలు తీసుకోవాలి. ఆలస్యమైతే ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారైన విగ్రహాలు, రసాయనాలతో పూసిన రంగులు చెరువులో కలిసి చేపలు మృత్యువాత పడతాయి. మత్స్యకారులు ఆర్థికంగా నష్టపోకముందే వినాయక విగ్రహాల వ్యర్థాలను వెంటనే తొలగించాలి.

- శీలం సాంబయ్య, అల్లీపురం, వరంగల్

యూరియా కోసం బారులు



అశోక్‌నగర్‌లో యూరియా కోసం బారులు తీరిన రైతులు

ఖానాపురం: మండలంలోని అశోక్‌నగర్‌లో రైతులు యూరియా కోసం భారీగా బారులు తీరారు. శనివారం ఉదయం 555 బస్తాల యూరియా రాగా.. అశోక్‌నగర్, చిలుకమ్మతండా, పర్శతండా, అయోధ్యనగర్ తదితర గ్రామాల నుంచి సుమారు 1200 మంది రైతులు వచ్చారు. తోపులాట జరిగి మహిళలు కొట్టుకున్నారు. దీంతో యూరియా పంపిణీని అధికారులు గ్రామ పంచాయతీ కార్యాలయానికి మార్చారు. టోకెన్లు ఇవ్వడంలో వ్యవసాయ అధికారులు నిర్లక్ష్యం చేయగా రైతులు, సీపీఎం నాయకులు అశోక్‌నగర్‌లో రాస్తారోకో చేశారు. అనంతరం టోకెన్లు ఇచ్చి రాస్తారోకోను విరమింపజేశారు. టోకెన్ల పంపిణీని ఏడీఏ దామోదర్‌రెడ్డి పరిశీలించారు. ఎస్సై రఘుపతి, సొసైటీ సీఈఓ ఆంజనేయులు రైతులకు సర్దిచెప్పి యూరియా పంపిణీ సజావుగా సాగించారు. ఒక్కో రైతుకు ఒక్కో బస్తాను మాత్రమే ఇచ్చారు. యూరియా అందని రైతులు భారీగా వెనుదిరిగిపోయారు.

క్లుప్తంగా

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య


స్వప్న(ఫైల్)

చిట్యాల: కుటుంబ కలహాలతో ఓ మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన శనివారం మండలంలోని నైన్‌పాకలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మారపెల్లి స్వప్న(38)తో భర్త మహేందర్, అత్త నర్సమ్మ గొడవ పడ్డారు. దీనిపై మనస్తాపం చెందిన స్వప్న పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108లో స్థానిక సివిల్ ఆస్పత్రికి తరలించగా స్వప్న అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై మృతురాలి తల్లి సమ్మక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై శ్రావన్‌కుమార్ తెలిపారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

స్నేహితుడిని కాపాడబోయి..

- కెనాల్‌లో పడి యువకుడి గల్లంతు
- మొగిలిచర్లలో ఘటన


పూర్ణచందర్(ఫైల్)

గీసుకొండ: కెనాల్‌లో పడిన స్నేహితుడిని కాపాడబోయి ఓ యువకుడు గల్లంతయ్యాడు. ఈ ఘటన గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచర్ల శివారులో చోటు చేసుకుంది. గీసుకొండ సీఐ మహేందర్ కథనం ప్రకారం.. మొగిలిచర్లకు చెందిన ఎర్రం పూర్ణచందర్(19) శుక్రవారం రాత్రి గ్రామంలోని మేకల బండ వద్ద గణేశ్ నిమజ్జన కార్యక్రమంలో ఉన్నాడు. ఈ క్రమంలో తన స్నేహితులు కాలే రాకేశ్, నక్కినేని భరత్ తమ ద్విచక్రవాహనంపై పూర్ణచందర్‌ను తీసుకెళ్లి ఎస్సారెస్పీ కాల్వ వద్ద మద్యం తాగారు. ఈ సమయంలో రాకేశ్ మద్యం మత్తులో బ్రిడ్జిపై నిలబడి మూత్రవిసర్జన చేస్తుండగా ప్రమాదవశాత్తు జారి కాల్వలో పడ్డాడు. పూర్ణచందర్ అతడిని రక్షించడానికి కాల్వలోకి దూకగా నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. అయితే రాకేశ్ ఈదుకుంటూ కాల్వ నుంచి బయటకు వచ్చాడు. శనివారం పూర్ణచందర్ తండ్రి రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

మేడిగడ్డ బ్యారేజీలోకి 4.51లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి మేడిగడ్డ బ్యారేజీలోకి 4.51లక్షల క్యూసెక్కుల వరద తరలివస్తోంది. శనివారం ఎగువ నుంచి క్రమక్రమంగా వరద తగ్గుముఖం పట్టింది. దీంతో అదే స్థాయిలో బ్యారేజీలోని 85గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు.




మొరాయిస్తున్న ఈవీ బస్సులు

ఆర్టీసీకి గుదిబండగా మారిన వైనం
- కాలుష్యాన్ని తగ్గించేందుకు వరంగల్ రీజియన్‌కు 112 బస్సుల కేటాయింపు
- జేబీఎం సంస్థ నిర్వహణ.. తరచూ బ్రేక్‌డౌన్
- రోజుకు 15వేల కిలోమీటర్లు రద్దు


ఎలక్ట్రిక్ బస్సులు

హన్మకొండ : సాంకేతిక సమస్యలు, నిర్వహణ లోపంతో ఎలక్ట్రిక్ బస్సులు మొరాయిస్తున్నాయి. నెలలో 90నుంచి 95 బ్రేక్‌డౌన్లు, మరమ్మతులతో ఆర్టీసీకి గుదిబండగా మారాయి. కాలుష్యాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహిస్తోంది. ఈక్రమంలోనే ప్రధాన మంత్రి ఈ–బస్ సేవా పథకంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థకు పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించింది. ఆర్టీసీ యాజమాన్యం వరంగల్ రీజియన్‌కు 112 ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించగా వీటిని వరంగల్–2 డిపో ద్వారా నడుపుతోంది. వీటికి ప్రత్యేకంగా విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణంతోపాటు చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఎలక్ట్రిక్ బస్సులను ఈ ఏడాది జనవరి 6వ తేదీన రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండ సురేఖ ప్రారంభించారు. బస్సులు ప్రారంభం నుంచి ఫెయిల్యూర్స్‌తో టీజీఎస్ వరంగల్ రీజియన్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.


ఆర్టీసీ వరంగల్–2 డిపోలో మరమ్మతుకు వచ్చిన జేబీఎం ఎలక్ట్రిక్ బస్సు

రోజుకు 3నుంచి 4 బ్రేక్‌డౌన్లు

ప్రతీ రోజు 3నుంచి 4 బస్సులు బ్రేక్‌డౌన్ అవుతున్నాయి. ఒక్క ఆగస్టులోనే 95 బస్సులు బ్రేక్‌డౌన్ అయ్యాయంటే ఈవీ బస్సుల వైఫల్యానికి అద్దం పడుతోంది. ఇందులో కొన్ని ప్రమాదాల కారణంగా నిలిచిపోయినవి కూడా ఉన్నాయి. రోజుకు 15వేల కిలోమీటర్లు రద్దు చేసుకోవాల్సి వస్తోందని, క్వాలిఫైడ్ మ్యాన్‌పవర్ లేకపోవడం వల్ల ఈ దుస్థితి నెలకొందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. జేబీఎం కంపెనీ వారికి చెప్పినా ఫలితం లేదని అధికారులు పేర్కొంటున్నారు. సాంకేతిక సమస్యలు, ప్రతి దానికి సెన్సార్లు ఏర్పాటు చేయడంతో చిన్నపాటి తేడా వచ్చినా బస్సు ముందుకు కదలదు. దీంతోపాటు చాసిస్ క్రాక్ రావడం, సస్పెన్షన్ల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. బస్సులు ప్రారంభించిన 270 రోజుల్లో దాదాపు 810కి పైగా బ్రేక్‌డౌన్లు కావడం చూస్తే సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. సెన్సార్లు, ఇతర సాంకేతిక సమస్యలతోపాటు చార్జింగ్ సమస్య ఎలక్ట్రిక్ బస్సులను వేధిస్తోంది.

నైపుణ్యం కలిగిన మెకానిక్‌లేరి?

బస్సుల నిర్వహణను చూస్తున్న జేబీఎం సంస్థకు నైపుణ్యం కలిగిన మెకానిక్‌లు లేకపోవడం, సిబ్బంది కొరతతో రోజుల తరబడి బస్సులు మరమ్మతుకు నోచుకోక నిలిచిపోతున్నాయి. ఎలక్ట్రిక్ బస్సుల మరమ్మతులపై అనుభవం లేకపోవడంతో కంపెనీ ప్రతినిధులపై ఆధార పడాల్సి వస్తోంది. ఈ బస్సుల సరఫరా నిర్వహణను జేబీఎం ఆటో లిమిటెడ్ అనుబంధ సంస్థ జేబీఎం ఎకోలైఫ్ మొబిలిటీ ప్రైవేట్ లిమిటెడ్‌కు ప్రభుత్వం అప్పగించింది. మొత్తం 112 బస్సుల్లో సూపర్ లగ్జరీ–21, డీలక్స్–22, ఎక్స్‌ప్రెస్ బస్సులు–69 ఉన్నాయి. వీటిని హనుమకొండ నుంచి హైదరాబాద్, నిజామాబాద్, ఏటూరునాగారం, సూర్యాపేట, సిద్దిపేట, కాళేశ్వరం, ఖమ్మం రూట్లలో తిప్పుతున్నారు.

దేవాలయాల అభివృద్ధే ధ్యేయం

- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ


కాశిబుగ్గ దేవాలయంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సురేఖ

వరంగల్ చౌరస్తా : దేవాలయాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ నేతృత్వంలో ప్రజాప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ఆరు దేవాలయాల్లో రూ. 4.35 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ డాక్టర్ సత్యశారదతో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం దేశాయిపేటలోని శ్రీరంగనాథస్వామి ఆలయంలో స్వామి వారి జన్మదినం సందర్భంగా కోటి దీపాలు వెలిగించే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ మట్టెవాడ భోగేశ్వర స్వామి దేవాలయం, దేశాయిపేట రంగనాయక స్వామి దేవాలయం, కాశీ విశ్వేశ్వరాలయం, కాశిబుగ్గ కాశీ విశ్వేశ్వర రంగనాయక స్వామి దేవాలయం, వరంగల్ గోవిందరాజుల గుట్ట, ఆంజనేయ స్వామి దేవాలయం, అబ్బనికుంటలోని మహేశ్వరి దేవాలయాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామన్నారు. పనులు నాణ్యతతో చేపట్టి వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తూర్పు నియోజకవర్గంలో 18 దేవాలయాల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేశామని, ఇందులో భాగంగా ఆరు దేవాలయాల్లో పనులకు శంకుస్థాపన చేశామన్నారు. కార్యక్రమాల్లో కార్పొరేటర్లు రామ తేజస్వి శిరీష్, కావేటి కవిత, చింతాకుల అనిల్ కుమార్, ఓని స్వర్ణలతభాస్కర్, సోమిశెట్టి ప్రవీణ్ కుమార్, టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, ఎండోమెంట్ అధికారి సునీత, సంబంధిత శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

యూరియా వచ్చేసింది..

ఖిలా వరంగల్: వరంగల్ గూడ్స్‌షెడ్‌కు శనివారం ఇఫ్కో కంపెనీకి చెందిన 2,676,960 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చేసింది. దీంతో ఎరువుల కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఊరట లభించనుంది. ఏడీఏ నర్సింగం, ఏఓలు రవీందర్‌రెడ్డి, విజ్ఞాన్.. కంపెనీ ప్రతినిధులతో కలిసి ఇఫ్కో కంపెనీ యూరియాను పరిశీలించారు. వరంగల్ జిల్లాకు 446.960, హనుమకొండ 590, ములుగు 230, జయశంకర్ భూపాలపల్లి 360, జనగామ 490, మహబూబాబాద్ జిల్లాకు 460 మెట్రిక్ టన్నులు కేటాయించగా 60శాతం మార్క్‌ఫెడ్‌కు, 40శాతం ఫర్టిలైజర్ డీలర్లకు కేటాయింపులు జరిగాయి. డిమాండ్ ఉన్న చోటుకు యూరియా త్వరగా పంపించేలా చర్యలు తీసుకున్నామని ఏఓ రవీందర్‌రెడ్డి తెలిపారు.

గోవాలో ఎంపీ కావ్య పవర్‌పాయింట్ ప్రజంటేషన్


పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న ఎంపీ కావ్య

హన్మకొండ చౌరస్తా: ఫ్రిడ్రిక్ ఎబర్ట్ స్టిఫుంజ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో శనివారం గోవాలో నిర్వహించిన సెమినార్‌లో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిజిటల్ ప్రపంచంలో మహిళల సమస్యలు, ఆర్థికాభివృద్ధికి అవసరమైన చర్యలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. చిన్న, మధ్య తరగతి ఆదాయం కలిగిన దేశాల్లో మహిళలు.. పురుషుల కంటే 8 శాతం తక్కువ సెల్ ఫోన్లు కలిగి ఉన్నారని, స్మార్ట్‌ఫోన్ వినియోగంలో 13శాతం తేడా ఉన్నట్లు వివరించారు. నేటికీ ప్రపంచంలో 405 మిలియన్ల మంది మహిళలు ఇంకా డిజిటల్‌కు చేరుకోలేదన్నారు. వరంగల్‌లో చారిత్రక ఘటనలు, కాకతీయ రాణి రుద్రమదేవి, సమ్మక్క, సారలమ్మ చరిత్రను వివరించారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి.. ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం, వడ్డీలేని రుణాలు అందజేస్తూ మహిళల ఆర్థిక పురోగతికి ప్రత్యేక కార్యచరణ అమలు చేస్తున్నారన్నారు.

ఎస్సార్‌కు 91వ ర్యాంకు

- నాలుగేళ్లుగా వరుసగా వంద లోపే..
- ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకుల్లో యూనివర్సిటీ టాప్
- తెలంగాణ ప్రైవేట్ ఇంజనీరింగ్ కేటగిరీల్లో ఏకైక యూనివర్సిటీ
- ఎస్సార్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ఎ.వరదారెడ్డి


మాట్లాడుతున్న ఎస్సార్ యూనివర్సిటీ చాన్స్‌లర్ వరదారెడ్డి

హసన్‌పర్తి: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్(ఎన్‌ఐఆర్‌ఎఫ్)లో ఎస్సార్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కేటగిరీలో 91వ ర్యాంకు దక్కించుకుందని ఆ యూనివర్సిటీ చాన్స్‌లర్ ఎ. వరదారెడ్డి అన్నారు. ఇటీవల ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్ జాబితా విడుదల చేసిందన్నారు. శనివారం ఎస్సార్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024లో 98 స్థానంలో నుంచి ఏకంగా 7స్థానాలకు ఎగబాకి 91 ర్యాంకు చేరిందన్నారు. నాలుగేళ్ల నుంచి వందకు లోపు ర్యాంకు సాధించినట్లు వివరించారు. విద్య నాణ్యత, పరిశోధన, ఆవిష్కరణలపై ఎస్సార్ విశ్వవిద్యాలయం పట్టు సాధించినట్లు మరోసారి నిరూపించుకుందన్నారు. తెలంగాణ ప్రైవేట్ యూనివర్సిటీల్లోని ఇంజనీరింగ్ కేటగిరీల్లో వంద లోపు ర్యాంకు సాధించిన ఏకైక యూనివర్సిటీ ఎస్సార్ అని పేర్కొన్నారు. దేశ, విదేశాలకు చెందిన 11వేల మంది విద్యార్థులు యూనివర్సిటీలో చదువుతున్నారని తెలిపారు. ఎస్సార్ యూనివర్సిటీ వీసీ దీపక్ గార్గ్ మాట్లాడుతూ తెలంగాణలోని ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో ఎస్సార్ యూనివర్సిటీ అగ్రస్థానంలో నిలిచిందన్నారు. ఇన్నోవేషన్, క్రియేటివిటీ, ఆంత్రప్రెన్యూర్‌షిప్ విలువలను పాఠ్యాంశంలో భాగంగా చేసుకోవడంతోపాటు బలమైన అధ్యాపక వర్గం, సమర్థవంత పరిశోధన ఫలితంగా 5వేలకు పైగా పరిశోధన పత్రాలు, 50కు పైగా పేటెంట్లు, 50కు పైగా పరిశోధన ప్రాజెక్టులు, అలాగే మైక్రో సాఫ్ట్ నుంచి 51 ఎల్‌పీఏ వంటి అత్యుత్తమ ప్లేస్‌మెంట్ సాధ్యమయ్యాయని తెలిపారు. ఎస్సార్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి, ప్రో వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల హక్కులు కాపాడాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి పట్టాభిరామారావు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ కె.పట్టాభిరామారావు

విద్యారణ్యపురి: వయోవృద్ధులంటే అనుభవం కలిగిన వ్యక్తులని, వారి హక్కులను గౌరవించి కాపాడాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ కె.పట్టాభి రామారావు అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా పరిషత్‌లోని వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌లో సీనియర్ సిటిజన్స్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. న్యాయవాదులు వయోవృద్ధుల కేసులను త్వరితగతిన పూర్తయ్యేలా న్యాయమూర్తుల ముందుకు తీసుకురావాలన్నారు. వయోవృద్ధుల లీగల్ ఎయిడ్ క్లినిక్ గురించి వివరిస్తూ ఈవ్యవస్థను పట్టణాల్లోనే కాకుండా మండల పరిధిలో, గ్రామ పరిధిలోనూ ఏర్పాటు చేసేందుకు సహకరిస్తామన్నారు. న్యాయ సలహా ప్రత్యుత్తరాలు దరఖాస్తుల పిటిషన్లు రూపొందించడంలో సాయం చేయడం లీగల్ ఎయిడ్ క్లినిక్‌ల బాధ్యత అన్నారు. ఈ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రతీ బుధవారం, శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే, జిల్లా సంక్షేమ అధికారి జయంతి, జిల్లా ట్రిబ్యునల్ డాక్టర్ అనితారెడ్డి, దేవాచారి, నాగులగాం నర్సయ్య, రేపాల నర్సింహ రాములు, దామోదర్, రాజేందర్, సాంబయ్య, సత్యనారాయణ, భూశిరెడ్డి సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి యుగేందర్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ సర్వీస్‌లు వెంటనే పునరుద్ధరించాలి

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి


మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ: భారీ వర్షాలు కురిసిన కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలో దెబ్బతిన్న వ్యవసాయ సర్వీస్‌లను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశించారు. శనివారం హనుమకొండలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్లు, చీఫ్ ఇంజనీర్లు, సీజీఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు కురిసిన జిల్లాలో కావాల్సిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, ఇతర మెటీరియల్ అందుబాటులో ఉన్నాయని, మెటీరియల్ కొరత లేదని పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. విద్యుత్ పునరుద్ధరణకు అహర్నిశలు కృషి చేసిన సిబ్బందికి జ్ఞాపికలు, ప్రశంస పత్రాలు అందజేయాలని సూచించారు. రియల్ టైం ఫీడర్ మానిటరింగ్ సిస్టం, ఫాల్ట్ ప్యాసేజీ ఇండికేటర్ పనుల పురోగతిపై సమీక్షిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డైరెక్టర్లు వి.మోహన్ రావు, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, సి.ప్రభాకర్, సి.ఈలు టి.సదర్ లాల్, కె.తిరుమల్ రావు, రాజు చౌహాన్, అశోక్, వెంకటరమణ, రవీంద్రనాథ్, కె.మాధవరావు, జీఎంలు వేణుబాబు, కృష్ణ మోహన్, వాసుదేవ్, సత్యనారాయణ, అన్నపూర్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



EDUCATION

DISTANCE EDUCATION

■ మావద్ద ఓపెన్ 10th, ఇంటర్, డిగ్రీ, పీజీ, MBA, LLB, B.Tech, ITI, డిప్లొమా, ఫార్మసీ, BAMS, MBBS, BPT, D.MLT, B.Ed, B.PEd అడ్మిషన్లకై సంప్ర: 99481 31154 [SCA 25007755]

REAL ESTATE

HOUSE FOR SALE

■ హన్మకొండ జూలైవాడ పోస్టల్ కాలనీలో వెస్ట్ ఫేస్ 300 sq.yards గల బిల్డింగ్ అమ్మబడును. వివరాలకు సంప్ర॥ 9849283034. [SCA25007941]

TO-LET

■ WGL, O'సిటీలో G+2 & Nspt మేన్‌రోడ్ G+2 (5000 Sft) బిల్డింగ్స్ కిరాయికి ఇవ్వబడును. షాపింగ్ మాల్స్ & బ్యాంక్స్‌కి. Cell: 9959699386. [SCA25007864]

PLOT FOR SALE

■ 413 Sq.yards, Near Vegetable Market, S/E Corner, Kazipet. 170 Sq.yards at Venkatadri Nagar, East Kazipet. Cont. 9398783805. [M-13916]

■ ఘట్‌కేసర్ చ॥గ॥ రూ.5700/–, భువనగిరి చ॥గ॥ రూ.3500/–, HMDA చ॥గ॥ రూ.7500/–, ఆలేరు/జనగాం చ॥గ॥ రూ.2300/– Cell: 9703650119 [HA-1327]

SERVICES

■ బాలాజీ (WGL) : హౌస్, ప్లాట్లు, రేకుల ఇంటిపైన, ఇందిరమ్మ ఇంటిపైన, పెంచన్ లోన్స్ ఇవ్వబడును. మార్టిగేజ్ లోన్స్, ఇళ్ళపైన లోన్స్ కలవు. సంప్ర.– 85228 25358. [SCA25007788]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

సర్టిఫికేట్ పోయినవి

■ గుండె హాసిని, D/o. గుండె చిట్టిబాబు, R/o. గ్రా॥ వడ్లకొండ, మం॥ జనగామ జిల్లా జనగామ గార్లవి ఒరిజినల్ SSC MEMO తీసుకొని మా గ్రామం నుండి జనగాంకి వస్తుండగా దారిలో పడిపోయాయి దొరికినవారు తెలుపగలరు. సంప్ర॥ 7993582943. [SCA 25007942]

హోమియో క్లినిక్

■ సంతానం కావాలా ? హోమియో వైద్య చికిత్సకై సంప్ర॥ 36 సం॥ Exp. డా॥ Ch.జితేందర్ BHMS శ్రీ రాజరాజేశ్వర హోమియో క్లినిక్. Opp: న్యూ బస్టాండ్, హన్మకొండ. 9849117394. [WA-7582]

BUSINESS OFFER

■ రూ. 2 లక్షల డిపాజిట్‌తో మీ ఏరియాల్లో "శ్రీ విజయలక్ష్మి పికిల్ స్టోర్"ని ప్రారంభించి షాపులో కూర్చుని బిజినెస్ చేస్తూ ప్రతి నెల 30 వేలు సాలరీ & బిజినెస్‌పై 30% మార్జిన్ పొందండి 8143909459 [SCA 25007952]

WANTED

■ Urgent Need well experienced Accountant & Kitchen Supervisor for a Reputed Restaurant in Hanamkonda. Cont: 9848092503, 9133211897. [WA-6764]

■ మడికొండ (ధర్మసాగర్) దగ్గరలో ఉన్న పెట్రోల్‌బంక్‌లో పని చేయుటకు మంచి ఉత్సాహవంతులైన వర్కర్స్ కావలెను. సెల్: 8247771016, 8247771525. [WA-7580]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, ఫుడ్ జీ: 18K. Ph: 9640400073, 9160900024. [SCA25007803]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోమ్ (TG NO-1) నాగోల్ Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్దులు/పేషెంట్ల సేవ వంట/ఇంటిపని బేబీకేర్ కై M/F వర్కర్స్ కా॥. భో+వ+జీతం: 16–18 వేలు. 9515108830/9063172215 [SCA25007927]

■ Reqd Retired Banker / Graduate for Bank Audit at Warangal. Ph : 9903285004. [HA-21494]

■ షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడీ వార్డెన్స్, లేడీ కేర్‌టేకర్స్, నర్సులు, కాంపౌండర్స్,వాచ్‌మెన్స్, సెక్యూరిటీ గార్డ్స్, డ్రైవర్స్, భార్యాభర్తలు కావలెను. 8985114453/ 9391036931 [HA-16042]

■ ప్రముఖ మ్యారేజి బ్యూరోలో పని చేయుటకు ఆఫీస్ అసిస్టెంట్ కావలెను. ఇంటర్ to డిగ్రీ, కంప్యూటర్స్ నాలెడ్జి వున్న స్త్రీ/పు సంప్ర: 8331857429 (నెలకు జీతము 6-9 వేల రూ.) [1966]

■ రామకృష్ణ గ్రూప్ (AP NO-1), VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 73829 73264, 99087 69888 [B-1280518]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

వరంగల్	9705748198 9866574715
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	7702221602
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సైబర్ మోసం..

- పీఎం కిసాన్ కేవైసీ లింక్ పేర రూ.లక్ష మాయం

లింగాలఘణపురం : సైబర్ మోసగాళ్లు బరితెగించారు. పీఎం కిసాన్ కేవైసీ పేరిట లింక్ పంపి ఓ ఆర్‌ఎంపీ(వైద్యుడు) నుంచి క్షణాల్లో రూ.లక్ష మాయం చేశారు. ఈ ఘటన మండలంలోని పటేల్‌గూడెంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ నర్సయ్య ఫోన్‌కు ఇటీవల పీఎం కిసాన్ కేవైసీ అప్‌డేట్ చేసుకోవాలని ఏపీకే లింక్ వచ్చింది. దీంతో ఓపెన్ చేసి అందులోని ఫామ్ పూర్తి చేశాడు. వెంటనే అతడి ఫోన్ సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసి తన యూనియన్ బ్యాంకు అకౌంట్ యూపీఐ పిన్ మార్చి విడతల వారీగా ఈ నెల 5న వెంట వెంటనే రూ.49,000, రూ.25,000, రూ.10,000, రూ.10,000, రూ.1,000, రూ.5,000 ఇలా మొత్తం రూ.లక్ష డ్రా చేసుకున్నారు. యూనియన్ బ్యాంకు అధికారులకు అనుమానం వచ్చి తమ ఖాతాదారుడైన నర్సయ్యకు ఫోన్ చేసి డబ్బులు ఇలా డ్రా చేస్తున్నావ్..నువ్వేనా అంటూ అడగడంతో కాదని చెప్పాడు. దీంతో వెంటనే నర్సయ్య ఖాతాలో ఉన్న రూ.7వేలు డ్రా చేశారు. అనంతరం సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడినట్లు గ్రహించిన ఆర్‌ఎంపీ.. 1930కు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

చేంజ్ ఓవర్ బ్రేకర్ ఫెయిల్యూర్‌తోనే విద్యుత్ ప్రమాదం

- నిర్ధారించిన అధికారులు
- వినియోగదారుడికి నోటీసు జారీ

హన్మకొండ: హనుమకొండలోని మర్కజీ స్కూల్ వద్ద ఇటీవల జరిగిన విద్యుత్ ప్రమాదానికి చేంజ్ ఓవర్ బ్రేకర్ ఫెయిల్యూర్ కారణమని టీజీ ఎన్పీడీసీఎల్ అధికారులు నిర్ధారించారు. విద్యుత్ సరఫరా నిలిపివేతతో ఇదే మెయిన్ రోడ్‌లో ఉన్న ఇండస్ బ్యాంకు సిబ్బంది జనరేటర్ ఆన్ చేశారు. ఈ సమయంలో అదే ప్రాంతంలో మరమ్మతు చేస్తుండగా జనరేటర్‌లో ఉత్పత్తి అయిన విద్యుత్ వెనుకకు రావడంతో కార్మికులు విద్యుదాఘాతానికి గురయ్యారు. ఈ ప్రమాదాన్ని ఎన్పీడీసీఎల్ అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. శనివారం హనుమకొండ సర్కిల్ డీఈ (టెక్నికల్–సేఫ్టీ), హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి, ఏడీఈలు మల్లికార్జున్, రాజు ఘటనాస్థలిని సందర్శించి ప్రమాదానికి కారణాలపై అధ్యయనం చేశారు. ఇండస్ బ్యాంక్ జనరేటర్ ఆన్ చేయడం ద్వారా రిటర్న్ విద్యుత్ సరఫరా జరిగిందని అంచనాకు వచ్చారు. నాన్ రిటర్న్ బ్రేకర్/స్విచ్ పని చేయకపోవడాన్ని గుర్తించి సంబంధిత వినియోగదారుడికి నోటీసు జారీ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. డీఈ (టెక్నికల్–సేఫ్టీ) ఎ.విజేందర్ రెడ్డి మాట్లాడుతూ డీజీ సెట్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డీజీ సెట్స్, ఇన్‌వర్టర్లు కలిగిన వినియోగదారులు తప్పనిసరిగా నాన్ రిటర్న్ బ్రేకర్ సక్రమంగా పని చేస్తుందో... లేదో పరీక్షించి నిర్ధారించుకోవాలన్నారు. లైన్ క్లియర్ సమయంలో రిటర్న్ సరఫరా జరిగి సిబ్బందికి ప్రమాదం జరిగే అవకాశముందన్నారు.

కంట్రోల్ రూంను సందర్శించిన సీపీ


కంట్రోల్ రూంలో సిబ్బందికి సూచనలిస్తున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

వరంగల్ క్రైం: పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూంను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ శనివారం సందర్శించారు. ఈసందర్భంగా సీపీ కంట్రోల్ రూంలో పని చేస్తున్న సిబ్బందితో మాట్లాడి, అత్యవసర కాల్స్ స్వీకరణ, స్పందన విధానం, డయల్ 100 కార్యకలాపాలను సమీక్షించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతీ కాల్‌ను అత్యంత జాగ్రత్తగా, తక్షణమే స్పందిస్తూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ముఖ్యంగా అర్ధరాత్రి సమయాల్లో పెట్రోలింగ్ నిర్వహించే పోలీస్ అధికారులు, సిబ్బందిని సమన్వయం చేస్తూ అత్యవసర పరిస్థితుల్లో అప్రమత్తతో విధులు నిర్వర్తించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని కమిషనర్ తెలిపారు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా కంట్రోల్ రూం 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండి, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

అమ్మవారికి అదనపు కమిషనర్ పూజలు


అమ్మవారిని మొక్కుతున్న దేవాదాయశాఖ అడిషనల్ కమిషనర్ శ్రీనివాసరావు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని శనివారం తెలంగాణ రాష్ట్ర దేవాదాయధర్మాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ ఈ.శ్రీనివాసరావు సందర్శించారు. ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత, అర్చకులు శేషు.. ఆయనను ఘనంగా స్వాగతించారు. పూజల అనంతరం అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలు మహదాశీర్వచనం అందజేశారు. వాల్గో ఇన్‌ఫ్రా సీఈఓ అండ్ ఎండీ గుంటి శ్రీధర్‌రావు, టీపీసీసీ జాయింట్ సెక్రటరీ మార్నేని వెంకటేశ్వరరావు, పారిశ్రామికవేత్త వీరమల్ల రవీందర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మేడారం ఈఓ వీరస్వామి, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్లు అనిల్‌కుమార్, సంజీవరెడ్డి, ఆలయ పర్యవేక్షకులు క్రాంతికుమార్, సిబ్బంది, ధర్మకర్తలు పాల్గొన్నారు.

హత్య ఘటనలో ఆరుగురి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ సంపత్‌రావు


నిందితుల అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ సంపత్‌రావు, పక్కన సీఐ, ఎస్సై

భూపాలపల్లి అర్బన్: ఇటీవల ఓ యువకుడిని కిడ్నాప్ చేసి హత్య చేసిన ఘటనలో ఆరుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణంలోని రాజీవ్‌నగర్‌కాలనీకి చెందిన ఎం.డి బాసిత్(20)కు నిందితులకు మధ్య కొద్ది రోజులుగా సామాజిక మాధ్యమాల్లో గొడవ జరుగుతోంది. ఈ క్రమంలో ప్లాన్ ప్రకారం నిందితులు ఈ నెల 3వ తేదీన బాసిత్‌ను పట్టణంలోని శాంతినగర్ సమీపంలోకి పిలిపించారు. దీంతో అక్కడికి చేరుకున్న బాసిత్‌ను రాదపాక బబ్లు, బస్స ప్రశాంత్, గాజుల కుషాల్, పందిళ్ల శ్రావణ్, బరిగల ప్రణయ్, చొప్పరి నవీన్ కలిసి కారులో మేడారం అడవుల్లోకి తీసుకెళ్లారు. అక్కడే కత్తితో పొడిచి హత్య చేసిన తర్వాత పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఈ ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఐ నరేశ్‌కుమార్, ఎస్సై సాంబమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

నిమజ్జనానికి వచ్చి మృత్యుఒడికి..

- నీటి మడుగులో పడి వాయిద్య కళాకారుడి మృతి


అంజన్న మృతదేహం

మంగపేట: మండలంలోని బ్రాహ్మణపల్లిలో గణేశ్ నిమజ్జనం సందర్భంగా బ్యాండ్ కొట్టేందుకు వచ్చిన గార అంజన్న(54) ప్రమాదవశాత్తు నీటి మడుగులో పడి మృతి చెందాడు. ఎస్సై టీవీఆర్ సూరి కథనం ప్రకారం.. శుక్రవారం గణేశ్ నిమజ్జన కార్యక్రమానికి వాజేడు మండలం ధర్మారం నుంచి పలువురు బ్యాండ్ వాయిద్య కళాకారులు వచ్చారు. కార్యక్రమం ముగిసిన అనంతరం అంజన్న కనిపించకపోవడంతో అతడి కోసం శనివారం ఉదయం వరకు వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో ఇంటికి వెళ్లి ఉంటాడని భావించారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం గ్రామంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ రోడ్డు పక్కన ఉన్న నీటి మడుగులో అంజన్న మృతదేహం తేలి కనిపించింది. మూత్ర విసర్జనకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటి మడుగులో పడి మృతి చెంది ఉండొచ్చని గ్రామస్తులు భావిస్తున్నారు. గ్రామస్తుల సమాచారం మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.